



Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక






ఆదివారం 26-04-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 314 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

# ‘తెలంగాణలో కొత్త విప్లవం ఆవిర్భావం’

## టీఆర్‌ఎస్ పేరుతో కవిత కొత్త పార్టీ ప్రకటన

- కొత్త జెండా ఆవిష్కరణ
- బీఆర్‌ఎస్‌పై కవిత విమర్శలు
- తెలంగాణ ఆత్మ కోల్పోయిందన్న వ్యాఖ్య
- ప్రజలకు అమ్మలా పాలన వాగ్దానం
- కేసీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలు
- సామాజిక తెలంగాణ లక్ష్యం
- రెండేళ్లలో అధికారమే టార్గెట్
- సీఎం అవుతానన్న కవిత ధీమా



**న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం):** తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీని ప్రకటించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో కవిత కొత్త పార్టీ పేరు , జెండాను ఆవిష్కరించారు. కొత్త పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అని ప్రకటించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుతో కూడిన జెండాను ఆవిష్కరించారు. మధ్యలో తెలంగాణ మ్యాప్, దానిపై ౧=౫ అనే అక్షరాలతో పార్టీ జెండాను రూపొందించారు. అనంతరం ప్రసంగించిన కవిత పార్టీ ఏర్పాటుకు దారితీసిన అంశాలను వెల్లడించారు. తెలంగాణ ఆత్మను బీఆర్‌ఎస్ కోల్పోవటంతోనే తాను తెలంగాణ రాష్ట్ర సేన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

‘ఇది నా జీవితంలో మర్చిపోలేని రోజు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ వచ్చి 12 ఏళ్లైనా మన కలలు పూర్తిగా నెరవేరలేదు. ఉద్యమ నేత కేసీఆర్ గారి అభివృద్ధి రథం గాడి తప్పింది. గతంలో కొన్ని తప్పులు జరిగాయి. ఆ తప్పుల్లో నేనూ భాగంగా ఉన్నా. తప్పుకి ఇప్పుడు క్షమాపణ చెబుతున్నా. తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నా. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది. అందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నేను తెలంగాణలోని మూడున్నర కోట్ల మందికి అమ్మగా పరిణితి చెందాలని అనుకుంటున్నా. అమ్మతనంతో పరిపాలన జరిగినప్పుడే రాష్ట్రం ముందుకుపోతుంది. ప్రజల కష్టాలు తీరుతాయి.

సామాజిక తెలంగాణే లక్ష్యంగా ముందుకు వెళ్తాం. తెలంగాణలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోండి. బీజేపీ అనే పార్టీకి తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేదు. ఇక బీఆర్ఎస్ నీళ్లు, నిధులు, నియామకాలను గాలి కొదిలేసింది. ఆనాడు టీఆర్ఎస్ కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పుడు కేసీఆర్ వేరు. ఇప్పుడున్న కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ప్రజలకు కష్టం వస్తే కేసీఆర్ రావటం లేదు. గుంట నక్కల చేతుల్లో ఖైదీ అయిన వ్యక్తి కేసీఆర్. అధికారం ముందు మమకారం తగ్గిందా..? కేసీఆర్ రాజకీయ పరిణితి లేకుండా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో కర్కోటకుడి పాలన నడుస్తుంటే.. కేసీఆర్ పట్టించుకోవటం లేదు. అందుకోసమే నేను ఈ నిర్ణయం తీసుకున్నా. కేసీఆర్ మారుతారేమోనని వేచి చూసినా మారలేదు. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసి మంచే చేశారు. ఆ పార్టీలో ఉండి నేను గట్టిగా పోరాడలేకపోయా. ఇప్పుడు నా రాష్ట్రం కోసం పోరాడుతా. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెబితే.. నన్ను పక్కన పడేసి పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఇది ప్రారంభం మాత్రమే.. ఇన్ ఫ్రంట్ దెరీజ్ క్రొకోడైల్ ఫెస్టివల్. ఇప్పుడు మనమే ప్రతిపక్షం అవుతాం.. రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తాం.’ అని కవిత వెల్లడించారు.

మిగతాది 2 లో..

# తెలంగాణలో జనగణన

## భారతి హోళికేరి కీలక ప్రకటన!



2 లో

**న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్రంలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జనగణన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియలో భాగంగా నిర్వహించే ‘స్వీయ ధ్రువీకరణ’ మరియు తొలి విడత గణనపై రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి శనివారం మీడియా సమావేశంలో కీలక వివరాలను వెల్లడించారు. రేపటి (ఆదివారం) నుంచి మే 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

సెల్ఫ్ ఎన్యుమరేషన్ అంటే ఏమిటి?

సాధారణంగా జనగణన సిబ్బంది ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారు. అయితే సాంకేతికతను జోడించి ఈసారి ప్రజలే నేరుగా తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనినే ‘సెల్ఫ్ ఎన్యుమరేషన్’ అంటారు. ప్రజలు దేశంలో ఎక్కడ ఉన్నా సరే, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని భారతి హోళికేరి సూచించారు.

# పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది



2 లో

**న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం):** కవిత కొత్త పార్టీపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది అన్నారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు వాళ్లను ఓడించి బీజేపీని గెలిపించారన్నారు. ఆమెకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీ అని చెప్పారు. బీజేపీ సపోర్ట్ లేకండానే రాష్ట్రం వచ్చిందా? అని ప్రశ్నించారు.ఇటీవల ఎంపీ తేజస్వీ యాదవ్ పార్లమెంట్‌లో తెలంగాణ విభజన అంశంపై మాట్లాడిన తీరును అరవింద్ వివరించారు. ఇండియా- పాకిస్థాన్ ప్రక్రియలో ఎంతో మంది చనిపోయారని.. వీళ్ళు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. అంత మంది చనిపోయారని తేజస్వి అన్నట్లు తెలిపారు.

# తెలంగాణ టీజీపీ ఎదుట 47 మంది మావోయిస్టుల లొంగుబాటు



2 లో

న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం): మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఛత్తీస్?గఢ్ బెటాలియన్ -1 కు చెందిన కమాండర్ హేమ్లా విజ్జ అలియాస్ ఐతు సహా 47 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా 32 ఆయుధాలు పోలీసులను మావోయిస్టులు పోలీసులకు అప్పగించారు. ఈ సరెండర్‌కు సంబంధించి మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్ రెడ్డి.. ఈ లొంగుబాటుతో ఛత్తీస్‌గఢ్ బెటాలియన్-1 పూర్తిగా లొంగిపోయినట్లుగా డీజీపీ శివధర్ రెడ్డి మీడియాకు తెలిపారు. వీరి వద్ద నుంచి ల్యాండ్ మైన్లలో వాడే వైర్లు 3 బండిళ్లు స్వాధీనం చేసుకున్నామని సౌత్ బస్తర్ డివిజన్‌కు చెందిన కీలక మావోయిస్టు లొంగిపోయారని తెలిపారు.

# బీజేపీ శ్రేణుల్లో ఫుల్ జోష్

## మే 9న తెలంగాణకు ప్రధాని మోడీ




2 లో

న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం): ప్రధాని నరేంద్ర తెలంగాణ పర్యటన ఖరారైంది. మే 9న ఆయన రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయబోతున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు తెలంగాణ బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే మూడోసారి ప్రధాని అయ్యాక మోడీ తెలంగాణలో పర్యటించడం ఇదే తొలిసారి కావడంతో ఈ టూర్‌ను తెలంగాణ బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత కొంత కాలంగా అంతర్గత సమస్యలతో సతమతం అవుతున్న టీ బీజేపీకి మోడీ టూర్ కాషాయ శిబిరంలో కొత్త జోష్ నింపే సూచనలు కనిపిస్తున్నాయి.

# పేదలకు గుడ్ న్యూస్

## ఇళ్ల నిర్మాణంపై మంత్రి కీలక ప్రకటన



2 లో

**న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం):** ప్రతి పేద వాడికి సొంతింటి కలను సాకారం చేయడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు కరగ్రహారంలో గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఇళ్ల లబ్ధిదారులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

# తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్

## ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి గవర్నర్ ఆమోదం



2 లో

**న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం):** తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రాష్ట్రంలో ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్ అయింది. మంత్రి అజారుద్దీన్, ప్రొ.కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు.

# ఏపీలో మళ్లీ పెట్రోల్, డీజిల్ కొరత

## అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష




2 లో

**న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం):** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నెలకొంది. ఏపీలోని ఉమ్మడి గోదావరి జిల్లాలు సహా కర్నూల్, నంద్యాలలోని పలు పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల వద్ద టూ వీలర్స్, త్రీ వీలర్స్, కార్లు, లారీలు ఇంధనం కోసం కిలోమీటర్ల మేర బారులు తీరాయి. రబీ కోతల సమయంలో డీజిల్ దొరక్కపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఏరియేటర్ల నిర్వహణకు డీజిల్ దొరకక రొయ్యలు, చేపల సాగుపై కూడా తీవ్రప్రభావం పడింది. క్రెడిట్ ఆప్షన్ ను రద్దు చేయడంతోనే ఆయిల్ కంపెనీలు బంకులకు ఇంధన సరఫరా తగ్గించడం కారణంగా తెలుస్తోంది.

# ‘వాడుకోవడం.. చంపేయడం’ జగన్ నైజం

## ఏపీ మంత్రి మండిపల్లి ఫైర్



2 లో

న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం): ‘యూజ్ అండ్ కిల్’.. ఇదే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ పొలిటికల్ పిక్చర్ అని ఏపీ రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. అధికారం కోల్పోయి రెండేళ్లు గడుస్తున్నా జగన్ పార్టీ పద్ధతి మార్చుకోలేదని విమర్శించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు కమాండ్ కంట్రోల్ నడుపుతూ రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

కడపలో ఇటీవల జరిగిన పెద్ద దస్తగిరి హత్య వెనుక జగన్ ఉన్నారని, ఆయన కనుసన్నల్లోనే ఈ ఘాతుకం జరిగిందని మంత్రి మండిపల్లి సంచలన ఆరోపణలు చేశారు. జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్య అనుచరుడైన దస్తగిరిని భూ లావాదేవీల గొడవల్లో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఠాలే హతమార్చాయని ఆరోపించారు.

# ‘తెలంగాణలో కొత్త విప్లవం ఆవిర్భావం’ టీఆర్ఎస్ పేరుతో కవిత కొత్త పార్టీ ప్రకటన




న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం): తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీని ప్రకటించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో కవిత కొత్త పార్టీ పేరు , జెండాను ఆవిష్కరించారు. కొత్త పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అని ప్రకటించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుతో కూడిన జెండాను ఆవిష్కరించారు. మధ్యలో తెలంగాణ మ్యాప్, దానిపై ౧ా అనే అక్షరాలతో పార్టీ జెండాను రూపొందించారు. అనంతరం ప్రసంగించిన కవిత పార్టీ ఏర్పాటుకు దారితీసిన అంశాలను వెల్లడించారు. తెలంగాణ ఆత్మను బీఆర్ఎస్ కోల్పోవటంతోనే తాను తెలంగాణ రాష్ట్ర సేన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

‘ఇది నా జీవితంలో మర్చిపోలేని రోజు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ వచ్చి 12 ఏళ్లైనా మన కలలు పూర్తిగా నెరవేరలేదు. ఉద్యమ నేత కేసీఆర్ గారి అభివృద్ధి రథం గాడి తప్పింది. గతంలో కొన్ని తప్పులు జరిగాయి. ఆ తప్పుల్లో నేనూ భాగంగా ఉన్నా. తప్పుకి ఇప్పుడు క్షమాపణ చెబుతున్నా. తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నా. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది. అందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నేను తెలంగాణలోని మూడున్నర కోట్ల మందికి అమ్మగా పరిణితి చెందాలని అనుకుంటున్నా. అమ్మతనంతో పరిపాలన జరిగినప్పుడే రాష్ట్రం ముందుకుపోతుంది. ప్రజల కష్టాలు తీరుతాయి.

సామాజిక తెలంగాణే లక్ష్యంగా ముందుకు వెళ్తాం. తెలంగాణలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోండి. బీజేపీ అనే పార్టీకి తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేదు. ఇక బీఆర్ఎస్ నీళ్లు, నిధులు, నియామకాలను గాలి కొదిలేసింది. ఆనాడు టీఆర్ఎస్ కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పుడు కేసీఆర్ వేరు. ఇప్పుడున్న కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ప్రజలకు కష్టం వస్తే కేసీఆర్ రావటం లేదు. గుంట నక్కల చేతుల్లో ఖైదీ అయిన వ్యక్తి కేసీఆర్. అధికారం ముందు మమకారం తగ్గిందా..? కేసీఆర్ రాజకీయ పరిణితి లేకుండా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో కర్కోటకుడి పాలన నడుస్తుంటే.. కేసీఆర్ పట్టించుకోవటం లేదు. అందుకోసమే నేను ఈ నిర్ణయం తీసుకున్నా. కేసీఆర్ మారుతారేమోనని వేచి చూసినా మారలేదు. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసి మంచే చేశారు. ఆ పార్టీలో ఉండి నేను గట్టిగా పోరాడలేకపోయా. ఇప్పుడు నా రాష్ట్రం కోసం పోరాడుతా. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెబితే.. నన్ను పక్కన పడేసి పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఇది ప్రారంభం మాత్రమే.. ఇన్ ఫ్రంట్ దేరీజ్ క్రొకోడైల్ ఫెస్టివల్. ఇప్పుడు మనమే ప్రతిపక్షం అవుతాం.. రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తాం.’ అని కవిత వెల్లడించారు.

అంతకు ముందు బంజారాహిల్స్‌లోని నివాసంలో కవిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సర్వమత ప్రార్థనల తర్వాత కవిత తన భర్త, కుటుంబసభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బంజారాహిల్స్ నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరిన కవిత.. పార్టీ శ్రేణులతో కలిసి అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడిన కవిత.. తెలంగాణలో సరికొత్త విప్లవం రాబోతుందన్నారు. తాను కచ్చితంగా తెలంగాణకు సీఎం అవుతానని ధీమా వ్యక్తం చేశారు. నిరుపేద, బడుగు, బలహీనవర్గాల గొంతుకనై వారి కోసం పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు.

# తెలంగాణ టీజీపీ ఎదుట 47 మంది మావోయిస్టుల లొంగుబాటు

మొదటి పేజీ తరువాయి



శనివారం లొంగిపోయిన వారిలో తెలంగాణ వాళ్లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. అయితే వీరిలో తెలంగాణ వారు ఎవరూ లేకపోయినా తెలంగాణలో వీరు కార్యాకలాపాలు సాగించినట్లు డీజీపీ తెలిపారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని అలాగే అదనంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం కూడా అందిస్తామన్నారు.

తెలంగాణ పోలీసుల కృషికి ప్రశంసలు:

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ పోలీసులు అంకితభావం, సమన్వయంతో చేసిన కృషిని డీజీపీ ప్రశంసించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ పోలీసులు వృత్తిపరమైన నైపుణ్యంతో నిరంతరం చేసిన కృషి వల్ల నలబై ఏడు మంది అజ్ఞాతం వీడారని తెలిపారు. శనివారం లొంగిపోయిన మావోయిస్టు క్యాడర్ల సంఖ్య, వారు అప్పగించిన ఆయుధాలను బట్టి చూస్తే మావోయిస్టు పార్టీ క్రమంగా క్షీణించడమే కాకుండా సంపూర్ణంగా పతనం అయిందనే విషయం స్పష్టం అవుతోందన్నారు. 2026 సంవత్సరంలో ఇప్పటి వరకు తెలంగాణలో మొత్తం 260 మంది అజ్ఞాత మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు.

తెలంగాణ నుంచి మిగిలింది నలుగురే:

తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టు కేడర్ లు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉండి తెలంగాణ వెలుపల వివిధ నిర్మాణంలో పని చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ నలుగురు ఛత్తీస్ గఢ్, జార్ఖండ్ లో కార్యాకలాపాలు కొనసాగిస్తున్నారని తెలిపారు.

# ఏపీలో మళ్లీ పెట్రోల్, డీజిల్ కొరత అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష



న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నెలకొంది. ఏపీలోని ఉమ్మడి గోదావరి జిల్లాలు సహా కర్నూల్, నంద్యాలలోని పలు పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల వద్ద టూ వీలర్స్, త్రీ వీలర్స్, కార్లు, లారీలు ఇంధనం కోసం కిలోమీటర్ల మేర బారులు తీరాయి. రబీ కోతల సమయంలో డీజిల్ దొరక్కపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఏరియేటర్ల నిర్వహణకు డీజిల్ దొరకక రొయ్యలు, చేపల సాగుపై కూడా తీవ్రప్రభావం పడింది. క్రెడిట్ ఆప్షన్ ను రద్దు చేయడంతోనే ఆయిల్ కంపెనీలు బంకులకు ఇంధన సరఫరా తగ్గించడం కారణంగా తెలుస్తోంది.

రాష్ట్రంలో పెట్రోల్ బంకుల మూసివేతపై సీఎం చంద్రబాబు నాయుడు అధికారులతో చర్చించారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎస్, సివిల్ సప్లైస్ అధికారుల్ని ఆదేశించారు. పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తో ఫోనులో మాట్లాడారు. స్టాక్ లేని బంకుల వివరాలను వెంటనే అందించాలని ఆదేశించారు. పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని.. వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. పెట్రోల్ స్టాక్ సమస్య ఉంటే వెంటనే ఆ బంక్ వారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు.

# పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది

మొదటి పేజీ తరువాయి



“తేజస్వి మాటలను బీఆర్ఎస్ కళ్ళద్దాలతో చూడకండి. కవికి కేసీఆర్ రజనీకాంత్‌ల కనపడుతున్నారా..? కేసీఆర్ రోబో అయ్యారా..?” అని ప్రశ్నించారు. మరోవైపు.. కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. “గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది.” అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. “విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలి” అని కవిత పేర్కొన్నారు.

# పేదలకు గుడ్ న్యూస్.. ఇళ్ల నిర్మాణంపై మంత్రి కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ “ రాష్ట్రంలో పేదలందరికీ సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా నాడు అన్న ఎన్టీఆర్ పక్కా ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. తర్వాత చంద్రబాబు నాయుడు గారు ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆస్తి కల్పించేలా చర్యలు తీసుకున్నారు. కానీ.. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాలను కూడా దోపిడీకి వాడుకున్నారు. ఇళ్ల స్థలాల పేరుతో ఎందుకూ పనికిరాని భూములను అధిక ధరలకు కొనుగోలు చేసి కమిషన్లు దండుకున్నారు. మెరక పేరుతో మట్టి తవ్వి దోపిడీకి పాల్పడ్డారు.” అని ఆరోపించారు.

“మచిలీపట్నం నియోజకవర్గం కరగ్రహారంలో 300 ఎకరాల భూ సేకరణలో భారీ అవినీతికి పాల్పడ్డారు. ఈ ప్రాంతమంతా చౌడు భూములే. రోడ్డు కంటే ఐదారు అడుగుల లోతులో భూములున్నాయి. వర్షం పడితే ఈ ప్రాంతమంతా నీటిలో మునిగిపోతుంది. అయినా పనులు చేయకుండానే కోట్లు దోచేశారు. కనీస సదుపాయాలు కల్పంచలేదు. సముద్రతీరంలోని చౌడు మట్టిని ఈ ప్రాంతానికి తరలించారు. తాగేందుకు నీరు లేవు. రోడ్లు లేవు. వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. 13 బ్లాకుల్లో సుమారు 16 వేల ఇళ్ల స్థలాలిచ్చారు. 800 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. అయినా వంద మంది కూడా ఇక్కడకు రాలేదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సుమారు 9500 ఇళ్లు డిజేబుల్ అయ్యాయి. కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇక్కడకు రావడానికి వెనకాడుతున్నారు.” అని మంత్రి వ్యాఖ్యానించారు.

“కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాల ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చింది. మంచినీటి సరఫరా, రోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మిగిలిన ఇళ్లు కూడా సెప్టెంబర్‌లోపు ప్రారంభించుకోవాలి. ఇళ్ల నిర్మాణాలకు గత ప్రభుత్వం కేంద్రం నుండి వచ్చే రూ.1.80 లక్షలు అందించి చేతులు దులుపుకుంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అధనంగా అందిస్తోంది. ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాకుండా.. ఏడాదిలోగా ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అండగా నిలుస్తాం.” అని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

# బీజేపీ శ్రేణుల్లో ఫుల్ జోష్ మే 9న తెలంగాణకు ప్రధాని మోడీ

న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం): ప్రధాని నరేంద్ర తెలంగాణ పర్యటన ఖరారైంది. మే 9న ఆయన రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయబోతున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు తెలంగాణ బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే మూడోసారి ప్రధాని అయ్యాక మోడీ తెలంగాణలో పర్యటించడం ఇదే తొలిసారి కావడంతో ఈ టూర్‌ను తెలంగాణ బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత కొంత కాలంగా అంతర్గత సమస్యలతో సతమతం అవుతున్న టీ బీజేపీకి మోడీ టూర్ కాషాయ శిబిరంలో కొత్త జోష్ నింపే సూచనలు కనిపిస్తున్నాయి.

సెట్ రైట్ అయ్యేనా?:

ప్రస్తుతం తెలంగాణ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ప్రధాన పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్లు ఎత్తుకు పై ఎత్తుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ బహిరంగ సభలతో ఇరు పార్టీల మధ్య పొలిటికల్ వార్ రంజుగా సాగింది. ఈ క్రమంలో తెలంగాణ గడ్డపై ఎంట్రీ ఇవ్వబోతున్న మోడీ ఎలాంటి వ్యూహరచనతో రాబోతున్నారు అనేది ఉత్కంఠగా మారింది. మరోవైపు ఇటీవల మహిళా బిల్లు, డీలిమిటేషన్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పర్యటనలో మోడీ ఎలా ఎటాక్ చేస్తారనేది తెలియాల్సి ఉంది. ఇక గత కొంత కాలంగా తెలంగాణ బీజేపీ నేతల మధ్య ఆధిపత్య పోరు చర్చగా మారింది. ఈ అంశంలో గతంలోనే మోడీ హెచ్చరించినా నేతలు తమ తీరు మార్చుకోలేదనే అసంతృప్తి సొంత పార్టీలోనే వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో మోడీ పర్యటన తెలంగాణ బీజేపీకి ఎటువంటి దిశానిర్దేశం చేయబోతున్నారు అనేది ఆసక్తిగా మారింది.

# ‘వాడుకోవడం.. చంపేయడం’ జగన్ నైజం.. ఏపీ మంత్రి మండిపల్లి ఫైర్

మొదటి పేజీ తరువాయి



హత్య తర్వాత దస్తగిరి ఇంట్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో వందల కోట్ల విలువైన ఆస్తుల డాక్యుమెంట్లు లభించాయని, వాటిలో రవీంద్రనాథ్ రెడ్డి, ఆయన భార్య, కుమారుడి పేర్లు ఉండటమే వైఎస్ఆర్ కాంగ్రెస్ ముఠాల భూదాహానికి నిదర్శనమని మండిపడ్డారు.

రాష్ట్రంలో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా ‘దండయాత్ర’ చేసే జగన్.. తన సొంత జిల్లాలో తన ముఖ్య అనుచరుడు హత్యకు గురైతే కనీసం పరామర్శించేందుకు ఎందుకు వెళ్లలేదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిలదీశారు. ఇది ఆయన రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. గతంలో బాబాయి వివేకానంద రెడ్డిని దారుణంగా హత్య చేసి, ఆ నిందను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై నెట్టి ‘నారాసుర రక్త చరిత్ర’ అంటూ విష ప్రచారం చేసినట్టే.. ఇప్పుడు దస్తగిరి హత్యను కూడా కూటమి ప్రభుత్వంపైకి నెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

డ్రైవర్‌ను హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు వంటి నేరస్థులను ప్రోత్సహించడం జగన్ నైజమని మండిపల్లి విమర్శించారు. వైసీపీకి నిజంగా చిత్తశుద్ధి, నైతికత ఉంటే తక్షణమే అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు అక్రమంగా సంపాదించి భూకబ్జాలు చేసి కట్టుకున్న ప్యాలెస్‌లు, వారి దౌర్జన్యాలపై తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టంచేశారు. భూములు, ఆస్తులు కోల్పోయిన బాధితులందరికీ న్యాయం చేసి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

రాయలసీమలో నేర సామ్రాజ్యాలు స్థాపించడం జగన్‌కే చెల్లిందని, అందుకే అక్కడి ప్రజలు వైసీపీని భూస్థాపితం చేశారని మంత్రి అన్నారు. వైసీపీ అరాచక రాజకీయాలను, కుట్రలను రాష్ట్ర ప్రజలు ఇకపై నమ్మే పరిస్థితి లేదని చెప్పారు.

# అన్నా అని పిలిచినందుకు సెలూన్ నిర్వాహకుడిపై ఎస్ఐ దాడి



న్యూస్ డెస్క్, 25 ఏప్రిల్ (ఇది కద నిజం): రక్షణ కల్పించాల్సిన పోలీసులే సామాన్యులపై ప్రతాపం చూపిస్తున్నారు. కేవలం ‘అన్నా’ అని పిలిచినందుకు ఓ సెలూన్ వర్కర్‌పై ఎస్సై వీరంగం సృష్టించిన ఘటన కరీంనగర్ నగరంలో కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని ఖాన్‌పురా ఏరియాలో ఉన్న ఒక బార్బర్ షాపుకు కరీంనగర్ త్రీటౌన్ ఎస్సై చందర్ షేవింగ్ చేయించుకోవడానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న రాము అనే వర్కర్, ఎస్సైని ఉద్దేశించి “కూర్చో అన్నా” అని మర్యాదపూర్వకంగా సంబోధించాడు. అయితే, ఆ పిలుపు ఎస్సై చందర్‌కు ఆగ్రహం తెప్పించింది. “నన్ను అన్నా అంటావా.. నీకెంత ధైర్యం?” అంటూ ఎస్సై చందర్ ఒక్కసారిగా రాముపై విరుచుకుపడ్డారు. మాటలతో ఆగకుండా సదరు వర్కర్‌పై భౌతికంగా దాడికి దిగారు. యూనిఫాంలో ఉన్నాననే విచక్షణ మరిచి, సామాన్యుడని చూడకుండా అరాచకం సృష్టించారు.


సీసీ కెమెరాలో రికార్డ్..

ఎస్సై చేసిన ఈ అరాచకం అంతా సెలూన్ షాపులోని సీసీ కెమెరాలో స్పష్టంగా నమోదైంది. ఈ విజువల్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ప్రభుత్వ అధికారి అయ్యుండి, సామాన్య కార్మికుడిపై ఇలా దాడి చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడు రాము తనకు న్యాయం చేయాలని, సదరు ఎస్సైపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు. ఉన్నతాధికారులు ఈ ఘటనపై స్పందించి, బాధ్యుడైన ఎస్సైపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# తెలంగాణలో జనగణన భారతి హోళికేరి కీలక ప్రకటన!

మొదటి పేజీ తరువాయి

అయితే.. ఇది ప్రతి ఒక్కరికీ తప్పనిసరి కాదు, కేవలం ఒక ఆప్షన్ మాత్రమే అని ఆమె స్పష్టం చేశారు.



33 ప్రశ్నలతో కూడిన గణన

జనగణనలో భాగంగా మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని డైరెక్టర్ వివరించారు. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే వారు కేవలం 27 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన 6 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను, రెండో దశలో ఎన్యుమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు వారికి నేరుగా తెలియజేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్న వారు ఆ తర్వాత ఎన్యుమరేటర్ వచ్చినప్పుడు తమకు వచ్చిన రిఫరెన్స్ నంబర్‌ను చూపిస్తే సరిపోతుంది. ఒక కుటుంబం సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్నా, లేకపోయినా, రెండో దశలో ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికీ రావడం తప్పనిసరి అని డైరెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయని వారి నుంచి ఎన్యుమరేటర్లు పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరిస్తారు. ప్రజలు ఈ ప్రక్రియకు సహకరించి ఖచ్చితమైన వివరాలను అందించాలని ఆమె కోరారు. మే 10వ తేదీ వరకు గడువు ఉన్నందున, ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్.. ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి గవర్నర్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

అప్పటి నుంచి గవర్నర్ ఈ ఫైల్ పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఏ సభలో ప్రాతినిధ్యం లేకుండానే కేబినెట్ లో స్థానం దక్కించుకున్న అజారుద్దీన్ తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలలలోపు ఏదైనా సభకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. ఈ గడువు ఏప్రిల్ 30 తో ముగియనుంది. ఓ వైపు గడువు ముంచుకు వస్తుంటే మరోవైపు ఎమ్మెల్సీ విషయంలో గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ప్రభుత్వాన్ని ఆందోళన కలిగించింది. ఈ క్రమంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా లోక్ భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయి ఎమ్మెల్సీల నియామకంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో శివ ప్రతాప్ శుక్లా ఈ ఫైల్ పై సంతకం చేశారు. ఇందుకు సంబంధించి త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. మంత్రి అజారుద్దీన్ కు మంత్రి పదవి అనేది సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఈ పరిణామం ఇటు అజారుద్దీన్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి భారీ ఊరటగా మారనుంది.

# వేడుకగా శ్రీవారి కల్యాణం



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):– ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీపెనుశీల లక్ష్మీ నరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు శనివారం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు స్వామి వారికి అభిషేకం, అనంతరం 10:30నిమిషాలకు శ్రీవార్ల కళ్యాణము, సాయంత్రం శ్రీవార్లకి తీరుచ్చి పల్లకిసేవ మరియు సహస్ర దీపాలంకరణ ప్రధానార్చకులు, వేదపండితులు, గిరిజన వాయిధ్యాలు, మంగళ వాయిద్యాలు నడుమ దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించి భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్యూలైన్ ఏర్పాటు, మంచినీరు సరఫరా,అన్నదానం కార్యక్రమం దేవస్థానం ఈ.ఓ.పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనగణన పై కలెక్టర్ అవగాహన




నల్లగొండ (ఇది కద నిజం) : భారత జనగణన ను జిల్లాలో రెండు దఫాలుగా నిర్వహిస్తున్నామని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ కోరారు.. జనగణన పై జిల్లా కలెక్టరేట్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... జనగణనలో భాగంగా తొలివిడతగా మే 11 నుంచి జూన్ 9వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ నిర్వహిస్తామని, సాధారణ జనాభా లెక్కంపును 2027 ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహిస్తానన్నారు.. ఈసారి డిజిటల్ విధానాల్లో ఆధునిక సాంకేతికను ఉపయోగించి ఈ జనగణన నిర్వహిస్తుండగా.. తెలంగాణ రాష్ట్రానికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ తేదీలు ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్ణయించారనీ తెలిపారు.. నిర్దేశిత రిపోర్టర్ ద్వారా స్వీయ జనగణన సౌకర్యం ఉంటుందని, ప్రతి కుటుంబం కచ్చితంగా వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు అవకాశం ఉంటుందని, అందువల్ల జిల్లా ప్రజలు సహకరించవలసిందిగా కలెక్టర్ కోరారు..

# గవర్నర్ కు ప్రముఖుల పరామర్శ



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీజ్ అస్వస్థతకు గురి అయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించి, అధికారులు చికిత్స చేయించారు. సాయంత్రానికి ఆయన పూర్తిగా కోలుకొన్నారు. ఈ విషయం తెలుసుకొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు... గవర్నర్ ను కలిసి పరామర్శించారు. మరో వైపు సోషల్ మీడియా ద్వారా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ చీఫ్ మాధవ్, వైసీపీ అధ్యక్షులు వైయస్ జగన్ పరామర్శలు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



కరీంనగర్ (ఇది కద నిజం) : తెలంగాణ ఆర్టీసీ కార్మికుల దశాబ్దాల కలను నెరవేరుస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 11% పీఆర్సీ ప్రకటించడంతో పాటు అన్ని డిమాండ్లను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ కరీంనగర్‌లో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వన్ డిపో వద్ద సంబరాలు అంబరాన్నంటాయి.

కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ గారి నేతృత్వంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు, అనంతరం ఆర్టీసీ కార్మిక సోదరులకు కాంగ్రెస్ నేతలు మిఠాయిలు పంచి సంబరాలు చేసినారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మిక సోదరులకు ఇది చారిత్రక రోజు.. మాటలు చెప్పి మోసం చేసిన గత పాలకుల కళ్ళు తెరిపించిన రోజు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చొరవ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారి సహకారం, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ గారి కృషితో నేడు ఆర్టీసీ విలీనం, 11% పీఆర్సీ సాకారమయ్యాయి. ఇది కార్మిక పక్షపాత ప్రభుత్వానికి నిదర్శనం. దశాబ్దాలుగా కన్నీళ్లు పెట్టుకున్న ఆర్టీసీ కుటుంబాల్లో నేడు వెలుగులు నింపాం. కార్మికుల ఉసురు పోసుకున్న వాళ్లకు ఇది చెంపపెట్టు. మా ప్రభుత్వం ఎప్పుడూ కార్మికుల పక్షానే ఉంటుంది అని అన్నారు.

# రావులపాలెంకు ఉత్తమ పంచాయతీ పురస్కారం



రావులపాలెం (ఇది కద నిజం) ఏప్రిల్:25 రాష్ట్రంలోనే తొలి "ఐ ఎస్ వో" సర్టిఫికేట్ అందుకున్న రావులపాలెం గ్రామపంచాయతీకి ఉత్తమ పురస్కారం దక్కింది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురష్కరించుకుని అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ చేతుల మీదుగా పంచాయతీ డెవలప్మెంట్ అధికారి ఎల్.దుర్గా ప్రసాద్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ రోడ్లు,డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఈ గ్రామపంచాయతీ చేసిన కృషి గాను ఈ పురస్కారం దక్కింది.

# బంగారు నంది అవార్డు అందుకున్న రాపూరు నివాసి దుగ్గిరెడ్డి వెంకట్ రెడ్డి




నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం): –ప్రముఖ హైదరాబాద్ మహానగరంలోని రవీంద్రభారతి శిల్ప కళావేదికలోని "సిరాజ్ డాన్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ" నిర్వహించిన పూర్ణ నంది తెలుగు తేజం అవార్డ్స్2026 ను మన రాపూరు మండలంలోని రామకూరు గ్రామ నివాసి అయిన ఎన్నోఉన్నత చదువులు చదువుకుని అమెరికా మహానగరంలో స్థిరపడి తన నటన మీద మక్కువతో 2022 సంవత్సరంలో 'గాలోడు' తన మొదటిసినిమాతో సినీ ప్రవేశ అరగేట్రంచేసి ఎన్నో సినిమాల్లో ఎన్నో మంచి పాత్రలు చేసి తెలుగు సినీ ప్రేక్షకులను అలరించి తద్వారా సినీ నిర్మాతగా మొదలుపెట్టి ఎంతో కొత్త సినీ నటులకు అవకాశాలు కల్పిసున్నారు. అమెరికాలోని అట్లాంటా స్థిరపడిన ప్రముఖ సినీ నిర్మాత మరియు సినీ నటుడు మన దుగ్గిరెడ్డి వెంకట్ రెడ్డికి 'పూర్ణ నంది తెలుగు తేజం అవార్డ్ 2026' ముఖ్య అతిథిగా మరియు అవార్డు గ్రహీత ఉండటం మనమెంతో గర్వించదగ్గ విషయం.. అదేవిధంగా దుగ్గిరెడ్డి వెంకట్ రెడ్డికి వేదికపై ఆహ్వానించి శాలువతో సన్మానించి మరియు బంగారు నంది అవార్డ్ 2026 ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన రామకూరు నివాసి అయిన వెంకటగిరి నియోజకవర్గము వాలంటీర్ విభాగ అధ్యక్షులు దుగ్గిరెడ్డి నారసింహరెడ్డిని వేదికపై ఆహ్వానించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంతోమంది సినీ ప్రముఖులు మరియు పారిశ్రామిక వేత్తలు మరియు సినీ ప్రేక్షకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలకు సంతృప్తికర సమాధానం చెప్పండి....!!



గుడివాడ,ఏప్రిల్ 25(ఇది కద నిజం): ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజల వద్దకే వెళ్లి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు.

గుడివాడ పట్టణం 15వ వార్డు గుడ్‌మెన్ పేటలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ వార్డు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల వద్ద నుండి ఎమ్మెల్యే 139 అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులతో మాట్లాడి పలు సమస్యలను ఎమ్మెల్యే రాము తక్షణమే పరిష్కరించారు. ఆర్థికపరమైన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజా దర్బార్ లో పాల్గొన్న ప్రజలు.... ఎమ్మెల్యే రాము కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ...... తనపై ఎంతో ఆదరణ చూపే గుడ్‌మెన్ పేటకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మీ సమస్యలు నేరుగా తెలుసుకోవడం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చిన్న సమస్యలను ఇక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించామని, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి కొద్దిగా సమయం పడుతుందనీ, కానీ తప్పకుండా పరిష్కరిస్తామన్నారు.





# స్విస్ ప్రాంగణంలో సందడి గా భవ్యోదయ

పిల్లలకు చిన్నతనంలోనే విద్య తో పాటు విలువలు, సంస్కారం నేర్పాలని విద్యా భారతి అఖిల భారతీయ ప్రచార ప్రభారీ లింగం సుధాకర్ రెడ్డి పిలుపు ఇచ్చారు. చిన్నతనంలోనే విలువలను నేర్పిస్తే, అవి పెద్దవారైనప్పుడు కూడా కొనసాగించటానికి వీలవుతుందని వివరించారు. ఈ దిశగా విద్యార్థులను ఉపాధ్యాయులు చైతన్య పరచాలని విశ్లేషించారు. పిల్లల మానసిక స్థితి, తర్వాత కాలంలో ప్రభావం చూపే అంశాలను వివరించారు. సంస్కారం, విలువలు బలపడినప్పుడు పిల్లలు పెద్దవాళ్లయ్యాక, భవిష్యత్ లో దేశం మీద ప్రేమ, అభిమానం, భక్తి పెంచుకొంటారని సుధాకర్ రెడ్డి వివరించారు.

హైదరాబాద్ శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ (స్విస్ ) భవ్యోదయ కార్యక్రమం సందడిగా నిర్వహించారు. సెంట్రల్ సిలబస్ లో పదో తరగతి ఫలితాలలో నూటికి నూరు శాతం విద్యార్థులు ఫస్ట్ క్లాస్ తెచ్చుకొన్నారు. ఎక్కువ శాతం మంది డిస్టింక్షన్ తెచ్చుకొన్నారు. దీనిని పురస్కరించుకొని విద్యార్థులు, పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, కీలక ప్రసంగం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను చైతన్య పరిచారు. మరో అతిథి విద్యా భారతి క్షేత్ర కోశాధికారి పసర్తి మల్లయ్య మాట్లాడుతూ... స్విస్ ప్రస్థానాన్ని విశదీకరించారు. ఉపాధ్యాయులు సక్సెస్ ఒరవడి ని కొనసాగించాని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. పిల్లలకు ఉండవలసిన లక్షణాలను వివరించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కార్యదర్శి డాక్టర్ విశ్వేశ్వర రావు మాట్లాడుతూ, ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదని వివరించారు. వచ్చే సంవత్సరాలలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణ మోహన్ మాట్లాడుతూ... పిల్లలు పెద్దవాళ్లు అయ్యాక కూడా స్కూల్ పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులకు వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి బహుమతులు అందించారు. బోధించిన ఉపాధ్యాయులు అందరినీ స్విస్ మేనేజిమెంట్ సత్కరించింది.

# ధాన్యం సేకరణలో జాప్యం చేస్తే కఠిన చర్యలు..

## కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం..




ఉప్పలగుప్తం (ఇది కద నిజం)ఏప్రిల్ 25: ప్రస్తుతం కోత కోసిన వరి ధాన్యానికి సంబంధించి కొనుగోలు ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే పూర్తి చేయాలని మండల స్థాయి అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు మరియు కొనుగోలు కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి

ధాన్యం సేకరణలో జాప్యం జరిగినా, రైతుల నుంచి ఫిర్యాదులు అందినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి–1లోని రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని ప్రత్యేక పరికరాలతో పరిశీలించి, కొనుగోలు రికార్డులను తనిఖీ చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర అందేలా చూడాలని కొనుగోలు సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అమలు చేయాలని, శిక్షణ తరగతులు మరియు అధికారిక వాట్సాప్ గ్రూపుల ద్వారా జారీ చేసిన ప్రతి సూచనను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. నిబంధనల అతిక్రమణను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. రైతులకు ధాన్యం కొనుగోలు, సేకరణలో పూర్తి సహకారం అందిస్తూ, నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పి. శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.వి. రామారావు, జిల్లా సహకార శాఖాధికారి రాధాకృష్ణతో పాటు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


# విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



నల్లగొండ (ఇది కద నిజం) : విద్యతో పాటు, వివిధ రకాల వృత్తి నైపుణ్యాలలో ప్రావీణ్యం సాధించాలని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యా సంస్థల సెక్రటరీ బి. సైదులు అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలో ఉన్న కనగల్ మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యాలయలో ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల బీసీ గురుకుల పాఠశాలలు, హాస్టల్ల విద్యార్థులకు ఏర్పాటుచేసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ తో కలిసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా గురుకుల కార్యదర్శి సైదులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్య తో పాటు వివిధ రకాల వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ ద్వారా అన్ని రకాల ఈవెంట్స్ లో శిక్షణ ఇస్తున్నట్టు ఇస్తున్నట్లు తెలిపారు.. ఈనెల 24 నుండి మే 8 వరకు నిర్వహిస్తున్న ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో భాగంగా క్రాఫ్ట్స్, గేమ్స్, స్పోర్ట్స్, కంప్యూటర్ ట్రైనింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ లో శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదనీ దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఆయా ఈవెంటల్లో రాణించి తమ ప్రత్యేకతను చాటుకోవాలని కోరారు..

## మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డికి

# ఎమ్మెల్యే వేగుళ్ళ పరామర్శ...



రావులపాలెం (ఇది కద నిజం) ఏప్రిల్ 25 :మాతృ వియోగంతో భాదపడుతున్న మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి ని రావులపాలెంలో వారి స్వగృహం నందు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు,రాష్ట్ర నీటిపారుదల అభివృద్ది సంస్థ ఛైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ పరామర్శించారు. ఈ సంధర్భంగా కొవ్వూరి సూర్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సినిమా న్యూస్

## బాక్స్ ఆఫీస్ వద్ద కింగ్ సైజ్ ర్యాంపేజ్



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన రొమాంటిక్ ఎంటర్టైనర్ "డార్లింగ్" 2010లో విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేయగా, మళ్లీ థియేటర్లలో ఈ సినిమాకి అద్భుతమైన స్పందన లభిస్తోంది. రీ రిలీజ్‌లో భాగంగా ఇప్పటికే రెండు రోజుల బాక్సాఫీస్ రన్ పూర్తయింది. ఈ రెండు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు 9.36 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టినట్లు మూవీ యూనిట్ అధికారికంగా ప్రకటించింది. కొత్త సినిమాలకు పోటీగా ఈ స్థాయి వసూళ్లు సాధించడం విశేషంగా మారింది. దీంతో ప్రభాస్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా, గుణశేఖర్ దర్శకత్వం వహించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై నిర్మించారు.




## జోరు పెంచిన శ్రీ విష్ణు



తెలుగు సినిమా పరిశ్రమలో అద్భుతమైన జోష్‌తో కెరీర్‌ను ముందుకు సాగిస్తున్న యువ నటుల్లో శ్రీ విష్ణు ఒకరు. ఈయన ఈ సంవత్సరం కేవలం వారం గ్యాప్‌లోనే విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ అనే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ రెండు సినిమాలు కూడా మంచి ప్రేక్షకాదరణ పొందాయి. ఇక ప్రస్తుతం ఈయన చేతిలో ఏకంగా నాలుగు చిత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌లో సన్నీ సంజయ్ అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ ఆల్మోస్ట్ సగానికి పైగా పూర్తి అయినట్లు తెలుస్తోంది.

ఈ సినిమాతో పాటు ప్రస్తుతం రామ్ అబ్బరాజు దర్శకత్వంలో మరో సినిమాలో కూడా నటిస్తున్నాడు. ఆ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతోంది. ఈ రెండు సినిమాలను ఈ ఏడాది రిలీజ్ చేసే ప్లాన్‌లో శ్రీ విష్ణు ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీ విష్ణు ప్రస్తుతం భాను భోగవరపు, పవన్ బసంశెట్టిలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు, అన్ని సానుకూలంగా జరిగితే ఈ ఇద్దరితో కూడా ఈ ఏడాది సినిమాలు స్టార్ట్ చేసే ఆలోచనలో ఈ యువ హీరో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా వరుస సినిమా షూటింగ్స్‌లో పాల్గొనడం మాత్రమే కాకుండా అనేక సినిమాలను ఒకే చేస్తూ శ్రీ విష్ణు ప్రస్తుతం జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నాడు.

## ప్రపంచ వేదికపై మరో గౌరవం



భారతీయ సినీ పరిశ్రమ నుంచి హాలీవుడ్ వరకు తన ప్రతిభతో సరిహద్దులను చెరిపేసిన నటి ప్రియాంక చోప్రా ఖాతాలో మరో ప్రతిష్ఠాత్మక గౌరవం చేరింది. ఆమెకు 'గ్లోబల్ వాన్‌గార్డ్ హానర్' అవార్డు లభించనుంది. ఈ అవార్డును అమెరికాలో నిర్వహించనున్న 'గోల్డ్ హౌస్ గోల్డ్ గాలా-2026' వేడుకల్లో ఆమె అందుకోనున్నారు. మే 9న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమం ఇప్పటికే విశేష దృష్టిని ఆకర్షిస్తోంది.ఆసియా-పాసిఫిక్ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతుల విజయాలను గుర్తించి సత్కరించే ఈ వేదికపై ప్రియాంకకు ఈ గౌరవం దక్కడం విశేషం. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, వివిధ రంగాల్లో ప్రభావం చూపిన నాయకులను కూడా ఈ వేడుకలో సత్కరించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రియాంక ఎంపిక కావడం భారతీయులకు గర్వకారణంగా మారింది.

ఇప్పటికే 25 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ప్రియాంకా చోప్రా, మిస్ వరల్డ్ విజేతగా తన ప్రయాణాన్ని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించింది. బాలీవుడ్‌లో అగ్రనటిగా ఎదిగిన ఆమె, తర్వాత హాలీవుడ్‌లోనూ గుర్తింపు పొందింది. భిన్న సంస్కృతుల మధ్య వారధిగా నిలుస్తూ భారతీయ సినీ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసింది. నటిగా మాత్రమే కాకుండా, సామాజిక అంశాల్లోనూ చురుకుగా పాల్గొంటూ సమాజానికి తన వంతు సేవ అందించడం కూడా ఆమెకు ఈ అవార్డు రావడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన వ్యక్తిగా ఆమెను గౌరవించడం ప్రత్యేకతను సంతరించుకుంది.

ఈ ఏడాది 'గోల్డ్ గాలా' వేడుక 'ఏ న్యూ గోల్డ్ వరల్డ్' అనే అంశంతో జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రియాంకతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. వ్యాపారం, సాంకేతికం, ఫ్యాషన్, క్రీడలు వంటి విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 650 మంది ప్రముఖులు ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఇక ప్రియాంకా చోప్రా తన సినీ ప్రయాణాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. దర్శకుడు రాజమౌళి తెరకెక్కించనున్న 'వారణాసి' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌తో పాటు మరిన్ని అంతర్జాతీయ చిత్రాల్లోనూ ఆమె కనిపించనున్నారని తెలుస్తోంది.